# నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

- డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా
- ఎక్కడ సమస్య తలెత్తినా క్షణాల్లో పరిష్కారం
- టీఎస్ఎస్‌పీడీసీఎల్(ఆపరేషన్)
- డివిజనల్ ఇంజనీర్(డీఈ) ఎం. శ్రీధర్ తో 'సాక్షి' ముఖాముఖి

బన్సీలాల్‌పేట్: వేసవిలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తూ...డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు టీఎస్‌పీడీసీఎల్ ప్యారడైజ్ సర్కిల్(ఆపరేషన్) డివిజనల్ ఇంజనీర్(డీఈ) ఎం. శ్రీధర్ అన్నారు. మంగళవారం ఆయన 'సాక్షి' ముఖాముఖిలో విద్యుత్ సరఫరాకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ పరమైన సమస్యలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజవర్గాల్లోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు.



**ప్రశ్న: వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?**

డీఈ: వేసవి కాలంలో సహజంగా విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరాను మెరుగు పరిచేందుకు అవసరమైన నేర్పాట్లు చేస్తున్నాము. ఇప్పటికి ఆయా సెక్షన్ కార్యాలయాల పరిధిలో వేసవి యాక్షన్ ప్లాన్ రూపొందించాము. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశాము. పద్మారావునగర్, ప్యారడైజ్, సీతాఫల్‌మండి, తార్నాక, లాలాగూడ, పార్సీగుట్ట, జనరల్ బజార్, క్లాక్‌టవర్, బైబిల్ హౌస్ 9 సెక్షన్ కార్యాలయాలు, సిబ్బంది ఎల్లప్పుడూ వినియోగదారులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాము.

**ప్రశ్న: విద్యుత్ సరఫరా మెరుగుపరిచేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**



డీఈ- ఎం. శ్రీధర్

డీఈ: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశాము. ఇప్పటికే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను అప్‌గ్రేడ్ చేశాము. ఎక్కడ కూడా విద్యుత్ సరఫరాలో లోపం లేకుండా చర్యలు తీసుకుంటున్నాము. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే మా సిబ్బంది క్షణాల్లో అక్కడికి చేరుకునేలా ఏర్పాట్లు చేశాము.

**ప్రశ్న: సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

డీఈ: విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నాము. 24గంటల పాటు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే వారు ఆయా ప్రాంతాలకు వెళ్లి సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరిస్తున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను కూడా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాము.

**ప్రశ్న: 24/7 సేవలు అందించేందుకు తీసుకుంటున్న చర్యలేమీ?**

డీఈ: 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఫోన్ కాల్ వచ్చిన వెంటనే క్షణాల్లో అక్కడ ఉంటారు. సికింద్రాబాద్ పరిధిలో 6 ఎఫ్ఓసీ కార్యాలయాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. కరెంట్ పోయిన వెంటనే ఒక్క ఫోన్‌కాల్‌తో సిబ్బంది స్పందిస్తారు. విద్యుత్ చౌర్యం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు అపరాధ రుసుం వసూలు చేస్తుం. నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నాము.

**ప్రశ్న: సెంట్రల్ బ్రేక్ డౌన్ సర్వీస్ పనితీరు ఎలా ఉంది?**

డీఈ: విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైనా రాత్రి, పగలు తేడా లేకుండా సెంట్రల్ బ్రేక్ డౌన్ సిబ్బంది క్షణాల్లో అక్కడికి చేరుకుంటారు. ఓ ఏడీఈ స్థాయి అధికారితో పాటు నలుగురు ఏఈలు విధి నిర్వహణలో ఉంటారు. 24 గంటల పాటు ప్యూజ్ ఆఫ్ కాల్ కార్యాలయాలు అందుబాటులో ఉంటాయి. క్లాక్‌టవర్ ఎఫ్ఓసీ-9490619724, జేమ్స్‌స్ట్రీట్-94906 19722, పద్మారావునగర్-94906 19730, తార్నాక-94906 19734, లాలాగూడ-94906 19736, సీతాఫల్‌మండి-94906 19732.

## అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

చిలకలగూడ : రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. సీతాఫల్‌మండి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం దాదాపు రూ.40 లక్షల విలువైన షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని, దళారులను నమ్మరాదని సూచించారు. కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, సునీత, నాయకులు తీగుళ్ల రామేశ్వరగౌడ్, కంది నారాయణ, లింగాని శ్రీనివాస్, సుంకు రామ్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు

## రాజ్యాంగ విరుద్ధంగా మోదీ పాలన

చిలకలగూడ : రాజ్యాంగ మౌలిక సూత్రాలకు ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం తిలోదకాలిచ్చిందని సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్ అన్నారు. మంగళవారం మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి, చింతబావి, ఎన్టీఆర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో మోదీ హఠావో దేశ్ బచావో నినాదంతో ఇంటింటికి సీపీఐ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు బీజేపీ ప్రభుత్వం తిలోదకాలిచ్చిందన్నారు. ప్రధాని మోదీ కబంధహస్తాల నుంచి దేశాన్ని రక్షించేందుకే ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్, ప్రతినిధులు కొమురెల్లి బాబు, సోమయ్య, యాదగిరి, హనుమంతు, కళ్యాణ్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



దూద్‌బావిలో ఇంటింటికి సీపీఐ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

## చౌకధరల దుకాణాల ఆకస్మిక తనిఖీ

లాలాపేట: చౌకధరల దుకాణాల్లో(రేషన్ దుకాణాలు) మంగళవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి సివిల్ సప్‌లై అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తార్నాక ప్రాంతంలోని పలు దుకాణాలకు వెళ్లి స్టాక్ నిల్వ, రిజిస్టర్లను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న బియ్యం పంపిణీ సక్రమంగా జరుగుతుందా లేదా , తుకాల్లో హెచ్చు తగ్గులపై వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. దుకాణంలో సమయ పాలన, డీలర్లు వినియోగదారుల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై ఆరా తీశారు. అక్రమాలకు పాల్పడకుండా సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి, ఏఎస్ఓ సరస్వతి, సర్కిల్ 9 ఇన్స్‌పెక్టర్లు లోకేష్, ఉత్తేజ్, కిరణ్, స్థానికులు ఉన్నారు.



రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

## ఘనంగా మహా సుదర్శన హోమం

రాంగోపాల్‌పేట్: శివాజీనగర్‌లోని సుదర్శన భూవరాహ స్వామి దేవాలయంలో స్వామివారి ఆలయంలో ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం స్వామివారికి మహా సుదర్శన హోమం నిర్వహించారు. మహా పూర్ణాహుతి నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం నాదస్వర కచేరీ, శ్రీకృష్ణ రాయభారం నాటికలు భక్తులను అలరించాయి. దేవాదాయ శాఖ డీసీ రామకృష్ణ, కార్పొరేటర్ కొంతం దీపిక, అభివృద్ధి కమిటీ చైర్మన్ నర్సారెడ్డి తదితరులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

### నేడు ఊంజల్ సేవ

బుధవారం స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహించనున్నారు. ఉదయం 9గంటలకు ఊంజల్ సేవ సాయంత్రం 4 గంటలకు సంగీత కచేరి, 6.30గంటలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఈవో సత్యమూర్తి తెలిపారు.



## ఫ్యాటీ లివర్ కేసులు ఆందోళనకరం

డాక్టర్ విమలాకర్‌రెడ్డి



రాంగోపాల్‌పేట్: నానాటికి పెరుగుతున్న ఫ్యాటీ లివర్ కేసులు ఆందోళన కలిగిస్తున్నాయని కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రి కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ విమలాకర్‌రెడ్డి అన్నారు. వరల్డ్ లివర్‌డే సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో 18-35 శాతం జనాభా ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడుతుందన్నారు. లివర్ పనిచేయకపోవడంతో 8 శాతం మంది లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేయించుకోవాల్సి నెలకొందన్నారు. ఫ్యాటీ లివర్‌పై జాగ్రత్తగా ఉండాలని తరచు లివర్ చెకప్ చేయించుకోవాలన్నారు. షుగర్, బీపీ, అధిక బరువు, మెటబాలిక్ సింగ్రోమ్ తదితర కారణాలతో లివర్‌లో కొవ్వు చేరడాన్నే ఫ్యాటీ లివర్‌గా పేర్కొంటారన్నారు. లివర్ మన శరీరంలో 250 పనులు చేస్తుందని, లివర్ సమస్యలు తలెత్తితే కామెర్లు, కడుపులో నీరు చేరడం, కాళ్ల వాపులు, రక్తవాంతులు, మనిషి స్పృహ తప్పే లక్షణాలు కనిపిస్తాయన్నారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే లివర్ ఫెయిల్యూర్‌కు దారితీస్తుందని హెచ్చరించారు. మద్యం సేవించకపోయినా, ఎలాంటి వైరస్ ఇన్‌ఫెక్షన్ సోకకపోయినా, లావుగా ఉండటం, బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ నియంత్రణలో లేకపోతే లివర్ చెడిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఫ్యాటీ లివర్ లక్షణాలుంటే వెంటనే గ్యాస్ట్రోఎంటరాలజిస్టును సంప్రదించాలని సూచించారు.

## టీఎస్‌సెట్-2022 ఫలితాలు విడుదల చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: అధ్యాపక ఉద్యోగాల అర్హత కోసం నిర్వహించిన తెలంగాణ స్టేట్ ఎలిజబిలిటీ టెస్ట్ (టీఎస్‌సెట్-2022) ఫలితాలను విడుదల చేయాలని అభ్యర్థులు మంగళవారం డిమాండ్ చేశారు. పరీక్షలు జరిగి నెల రోజులు గడుస్తున్నా ఇంత వరకు ఫలితాలను ప్రకటించక పోవడం దారుణమన్నారు. గురుకుల డిగ్రీ కాలేజీల్లో అధ్యాపక ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడినందున టీఎస్‌సెట్ ఫలితాలను వెంటనే ప్రకటించాలన్నారు. ఫలితాల్లో జాప్యం జరిగితే నిరుద్యోగులు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు.

## కోయ తెగలపై పరిశోధనకు ఓయూ డాక్టరేట్



పరమేష్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ చరిత్ర విభాగం విద్యార్థి కిన్నెర పరమేష్ ఖమ్మం జిల్లాలోని కోయ తెగల సాంఘిక-ఆర్థిక పరిస్థితులపై ప్రొ.అర్జున్‌రావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ఖమ్మం జిల్లా, కూసుమంచి మండలం, నాయకునిగుడెంకు చెందిన పరమేష్ యూజీసీ జేఆర్ఎఫ్ ఫెలోషిప్‌తో పీహెచ్‌డీ పూర్తి చేసినట్లు తెలిపాడు.

## అద్భుతంగా శ్రీ సీతారామచంద్ర దేవాలయం

అధికారులకు మంత్రి తలసాని ఆదేశం

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ ముషీరాబాద్ చౌరస్తాలోని చారిత్రక శ్రీ సీతారామచంద్ర దేవాలయాన్ని సకల సౌకర్యాలతో అద్భుతంగా తీర్చిదిద్దాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం తన నివాసంలో దేవాదాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పురాతనమైన దేవాలయంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలన్నారు. దేవాలయానికి వెళ్లేదారిలో దుకాణాలను నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ప్రస్తుతం ఆలయానికి 3,200 గజాల స్థలం ఉందని దానికి అనుగుణంగా సీతారాములు, ఆంజనేయస్వామి ఆలయాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. దేవాదాయ ఇంజనీరింగ్ శాఖ అధికారులు అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. త్వరలో దేవాదాయ శాఖ మంత్రి, కమిషనర్‌లతో కలిసి ఆలయ పునర్నిర్మాణ, అభివృద్ధి పనులు ప్రారంభించాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో కార్పొరేటర్ కె. హేమలత, పవన్‌కుమార్ గౌడ్, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామక్రిష్ణ, అసిస్టెంట్ కమిషనర్ క్రిష్ణ, ఆలయం ఈఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

## తాగునీటి సమస్య పరిష్కరించాలని మహిళల ధర్నా



వాటర్‌వర్క్స్ కార్యాలయం ఎదుట నిరసనలో పాల్గొన్న మహిళలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లిలోని ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్‌లో గత వారం రోజులుగా నెలకొన్న తాగునీటి సమస్యలను పరిష్కరించాలని బాగ్‌లింగంపల్లిలోని వాటర్‌వర్క్స్ కార్యాలయం ఎదుట మహిళలు మంగళవారం నిరసన చేపట్టారు. గత కొన్ని రోజులుగా డ్రైనేజీ పొంగుతూ.. కలుషిత తాగునీటి సరఫరా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ సందర్భంగా రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా డివిజన్‌లోని పలు బస్తీల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందని ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లో ఫ్రెషర్‌తో తాగునీరు సరఫరా అవుతోందని దీనికి తోడు అరగంటే నీటి సరఫరా కావడంతో నీరు సరిపోవడం లేదన్నారు. అధికారులు ఇష్టానుసారంగా నీటిని సరఫరా చేయడం ద్వారా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

## లియో క్లబ్ సేవలపై 2కే అవగాహన వాక్




2కే వాక్‌లో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, లియో క్లబ్ సంయుక్తంగా మంగళవారం 2కే వాక్ నిర్వహించారు. లియో క్లబ్ అందిస్తున్న సామాజిక సేవలపై ఈ వాక్ ద్వారా అవగాహన కల్పించారు. ఏటా మే నెలలో లియో క్లబ్‌లో సభ్యత్వ నమోదు ప్రక్రియను నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో క్లబ్‌లో యువతను చేర్చుకునే అంశంపై ఈ వాక్ ద్వారా తెలియపరిచే ప్రయత్నం చేశారు. కళాశాల నుంచి మొదలైన వాక్ రెండు కిలోమీటర్ల మేర సాగింది. ముఖ్య అతిథిగా లయన్ లక్ష్మీ, ఆత్మీయ అతిథులుగా లయన్ రఘునాథ్‌రెడ్డి, లయన్ కల్పన, లయన్ విజయానంద్, కళాశాల లియో కో-ఆర్డినేటర్ డాక్టర్ సరిత, అధ్యక్షురాలు అక్షయలు హాజరయ్యారు. ఈ సందర్భంగా లియో క్లబ్ ప్రాముఖ్యత, ఆ క్లబ్ సమాజహితం కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

### క్రైం కార్నర్..

## క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుడి అరెస్టు

సనత్‌నగర్: క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిని బేగంపేట పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ శ్రీనివాసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సోమవారం ఐపీఎల్ క్రికెట్ పోటీల్లో భాగంగా చెన్నై సూపర్‌కింగ్స్, బెంగుళూరు రాయల్ ఛాలెంజర్స్ మధ్య జరుగుతున్న మ్యాచ్‌పై బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ గౌతమి సిబ్బందితో కలిసి అన్నానగర్‌లోని కాళీమాత ఆలయం సమీపంలోని ఓ ఇంటిపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మర్తి బాబేందర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. గూగుల్‌క్రోమ్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న బెట్టింగ్ యాప్‌ల ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించి అతడిని అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు. బేగంపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వేర్వేరు ఘటనల్లో ఇరువురు అదృశ్యం



అదృశ్యమైన గోవర్ధన్, రత్నమ్మ (ఫైల్)

చిలకలగూడ : వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఓ వృద్ధురాలు, వృద్ధుడు అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ నరేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా, తాళ్లూరు గ్రామానికి చెందిన గోవర్ధన మోషే (60) స్థానిక బిల్డింగ్ కాంట్రాక్టర్ వద్ద కూలీగా పనిచేసేందుకు సీతాఫల్‌మండి జోషి కాంపౌండ్‌కు వచ్చాడు. ఈనెల 17న బయటికి వెళ్లిన అతను తిరిగి రాలేదు. కాంట్రాక్టర్ యేసోబు మంగళవారం పోలీసులను ఫిర్యాదు చేశాడు.

**మెట్టుగూడలో మహిళ..**

న్యూ మెట్టుగూడకు చెందిన రత్నమ్మ (60) ఈనెల 16న ఉదయం బయటికి వెళ్లి తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో గాలించిన ఫలితం లేకపోవడంతో ఆమె కుమారుడు రాము పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులుతెలిపారు.

## బలవంతంగా హాస్టల్ ఖాళీ చేయించేందుకు యత్నం

- ముగ్గురిపై కేసు నమోదు

సనత్‌నగర్: హాస్టల్‌ను బలవంతంగా ఖాళీ చేయించేందుకు ప్రయత్నించిన ఓ యూట్యూబ్ ఛానల్ విలేకరితో సహా ముగ్గురిపై ఎస్సార్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డిగూడలోని ఓ భవనాన్ని ప్రమీలారాణి ఆమె కుటుంబసభ్యులు హాస్టల్ నిర్వహణ కోసం గోరంట్ల హరిబాబు అనే వ్యక్తికి ఏడాది పాటు లీజుకు ఇచ్చారు. ఈ క్రమంలో అదే ప్రాంతానికి రవి, అతడి భార్య రాజేశ్వరితో పాటు ఓ యూట్యూబ్ ఛానల్‌లో విలేకరిగా పనిచేస్తున్న నిఖితారెడ్డి గత నెల 1న అక్కడికి వచ్చి హాస్టల్‌ను ఖాళీ చేయాలని నిర్వాహకుడు గోరంట్ల హరిబాబును బెదిరించారు. సోమవారం మరోసారి హాస్టల్‌కు వచ్చిన వారు హాస్టల్‌లో ఉంటున్న వారి వస్తువులను బయటపడేయడమేగాక చంపుతానని బెదిరించారు. హరిబాబు ఫిర్యాదు మేరకు మంగళవారం రవి, రాజేశ్వరి, నిఖితారెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## సాయన్న లేని లోటు పూడ్చలేనిది: మంత్రి తలసాని



మంత్రి తలసానితో మర్రి రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్: కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన మర్రి రాజశేఖర్ రెడ్డి మంగళవారం మంత్రి తలసానిని వెస్ట్ మారేడ్‌పల్లి లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సాయన్న మృతితో కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజలు పెద్దదిక్కును కోల్పోయినట్లుగా ఉందన్నారు. నియోజకవర్గ పరిధిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగేలా చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న పార్టీ కార్యక్రమాలు, అభివృద్ధి పనులపై వారు ఇరువురు చర్చించారు.

## అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

సనత్‌నగర్: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీఆర్ఎఫ్ సిబ్బంది మంగళవారం అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బేగంపేట ప్రకాష్ నగర్ మెట్రోస్టేషన్ సమీపంలోని జనార్దన్ ఛాంబర్‌లోని నల్లి షోరూం సిబ్బందికి అగ్ని ప్రమాదాల నియంత్రణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా డీఆర్ఎఫ్ సిబ్బంది రెస్క్యూ చేసే సమయంలో వినియోగించే పరికరాలు, వాటి పనితీరును వివరించారు. కార్యక్రమంలో డీఆర్ఎఫ్ సిబ్బంది హరికృష్ణ, శివకుమార్, శ్రీకాంత్, ఈశ్వర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

### క్లుప్తంగా...

#### కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 21, బెండకాయ 37, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 40, పచ్చ కాకర 40, పందిరి బీర 45, క్యాబేజీ 13, క్యారెట్ 19, దొండ 15, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 19 దోసకాయ 23, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 10, ఆలుగడ్డ 20, చామగడ్డ 45, మొరంగడ్డ 15, కందగడ్డ 45, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 10, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

#### ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు మధ్యాహ్న భోజనం

- దొడ్ల డెయిరీ ఉదారత

సనత్‌నగర్: బేగంపేట మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు మధ్యాహ్నం భోజనం అందించేందుకు దొడ్ల డెయిరీ ముందుకువచ్చింది. 2023-24 విద్యా సంవత్సరానికి గాను కళాశాలలో చదువుతున్న విద్యార్థినులకు అక్షయ పాత్ర ఫౌండేషన్ ద్వారా మధ్యాహ్న భోజనం అందించేందుకు దొడ్ల డెయిరీ యాజమాన్యం చేయూతనందించింది. ఇందుకు సంబంధించి రూ.18,48,000 చెక్కును మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి చేతుల మీదుగా అక్షయపాత్ర ఫౌండేషన్‌కు అందజేశారు.

#### కాంట్రాక్టు అధ్యాపకురాలికి ఓయూ డాక్టరేట్



బోయిని రాధ

లాలాపేట: ఇంటర్మీడియట్ కాంట్రాక్టు అధ్యాపకురాలు బోయిని రాధకు ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ పీహెచ్‌డీ డాక్టరేట్ ప్రకటించింది. ఆమె ఆర్‌బీవీఆర్ఆర్ ఉమెన్స్ కళాశాల విశ్రాంత రీడర్ డాక్టర్ టీవీ నాగరంజనీ పర్యవేక్షణలో ' బిరుదు రాజు రామరాజు-జీవితం సాహిత్యం' అంశంపై సమగ్ర పరిశోధనా గ్రంథాన్ని సమర్పించారు. ఇందుకుగాను యూనివర్సిటీ రాధను డాక్టరేట్‌తో సత్కరించింది. సిద్దిపేట జిల్లా, కొండపాక మేధినీపూర్ గ్రామానికి చెందిన రాధ డాక్టరేట్ అందుకోవడం పట్ల పలువురు అధ్యాపకులు, బంధు మిత్రులు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

#### బల్కంపేట ఎల్లమ్మకు నెమలి పింఛాల మాల



నెమలి పింఛాల మాలను అమ్మవారికి సమర్పిస్తున్న ఆర్‌బీ నరేష్

సనత్‌నగర్: జాతీయ పక్షి నెమలి పింఛాలతో రూపొందించిన మాలను బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారికి సమర్పించారు. యువజన కాంగ్రెస్ నేత ఆర్‌బీ నరేష్ తమిళనాడులో ప్రత్యేకంగా నెమలి ఈకలతో తయారు చేయించిన మాలను మంగళవారం ఎల్లమ్మ-పోచమ్మ దేవస్థానం ఈఓ ఎస్.అన్నపూర్ణ సమక్షంలో అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా నరేష్‌ను ఈఓ అభినందించారు.

#### ఆస్పత్రికి అల్మరాల విరాళం



అమీర్‌పేట సివిల్ ఆస్పత్రికి అల్మరాలను అందజేసిన డాక్టర్ జాగృతి

సనత్‌నగర్: అమీర్‌పేట 50 పడకల సివిల్ ఆస్పత్రికి గైనకాలజిస్ట్ డాక్టర్ జాగృతి తన తండ్రి టీఎస్ రావు జ్ఞాపకార్థం రెండు అల్మరాలు (బీరువాలు), కుర్చీలను విరాళంగా అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దశరథ్, డీఎంఓ డాక్టర్ వినాయక్‌లకు ఆమె ఫర్నిచర్ అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థ ప్రభుత్వ ఆస్పత్రికి అవసరమయ్యే బీరువాలను, కుర్చీలను అందజేయడం అభినందనీయమన్నారు. రోగుల అవసరాలతో పాటు ఆస్పత్రి అవసరాలను తెలుసుకుని వాటిని సమకూర్చడంలో దాతలు చూపిస్తున్న ఆదరణ ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

#### పాటిగడ్డలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

సనత్‌నగర్: బేగంపేట పాటిగడ్డలో మంగళవారం సాయంత్రం బీఆర్ఎస్ సీనియర్ నేత శేఖర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.